సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం ‌: 7 ‌ఏప్రిల్ ‌: 2024



బాణసంచా కేంద్రంలో పేలుడు

చిట్యాలలోని బాణ సంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించటంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. - 8లో



బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని జగదీశ్‌రెడ్డి కోరారు. - 10లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36 (ఆదివారం సా॥)

సహర్ 4-42 (సోమవారం ఉ॥)

న్యూస్‌రీల్

నేడు ఉగాది కవి సమ్మేళనం

భువనగిరి : శ్రీకోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా ఆదివారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు భువన భారతి, జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం నరసింహారెడ్డి, పోరెడ్డి రంగయ్య, బండారు జయశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి పరిధి రాయగిరిలోని సోమరాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు కవి సమ్మేళనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సాహితీవేత్త డాక్టర్ ఎన్.గోపి, పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాహితీరంగంలో సేవలందించిన పలువురికి పురస్కారాలు ప్రదానం చేయడంతో పాటు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు వెల్లడించారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

స్పెషల్ అసిస్టెంట్లకు టీఏ, డీఏ ఇవ్వాలని వినతి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ జేఏసీ నాయకులు

భువనగిరి రూరల్ : పదవ తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో పాల్గొంటున్న స్పెషల్ అసిస్టెంట్లకు టీఏ, డీఏ ఇవ్వాలని ఉపాధ్యాయ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం డీఈఓ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. భువనగిరి మండలం అనాజిపురంలోని దివ్యబాల విద్యా మందిర్‌లో మూల్యాంకనం నడుస్తుందని, ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఉంటున్న వారిని స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించాల్సి ఉందన్నారు. కానీ, జిల్లాలోని అన్ని మండలాల నుంచి నియమించినందున టీఏ, డీఏలు ఇవ్వాలని పేర్కొన్నారు. దీంతో పాటు స్క్రూట్నీ చేసిన పేపర్ల వారీగా రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్టు సైదులు, వనం వెంకటేశ్వర్లు, పెంటయ్య, కల్లూరి రమేష్, మమత, నరేష్, బింగి బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి ఆలయంలో విశేష పూజలు



ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అదే విధంగా ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

నేడు మోడల్ స్కూళ్ల ప్రవేశ పరీక్ష

- జిల్లాలో ఏడు కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 1,686 మంది విద్యార్థులు

భువనగిరి : 2024–25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ప్రవేశాల కోసం ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష నిర్వహణకు ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

విద్యార్థులు, సెంటర్లు

6వ తరగతికి 1,086, 7,8,9,10 తరగతుల్లో సీట్ల భర్తీకి 600 మంది పరీక్షకు హాజరుకానున్నారు. 6వ తరగతికి ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు, 7నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్ష జరగనుంది.

ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి

మోడల్ స్కూళ్లలో 6,7,8,9,10 తరగతుల్లో ప్రవేశాల కోసం ఆదివారం జరిగే అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి.

– నారాయణరెడ్డి, డీఈఓ

రైతులకు బోనస్ ఇచ్చే వరకు పోరాటం

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- భువనగిరిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు

భువనగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు యాసంగి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ తక్షణమే అమలు చేయాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే, ఇచ్చేంత వరకు రైతులకు మద్దతుగా పోరాటం సాగిస్తామన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం భువనగిరిలోని రైతుబజార్ వద్ద దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయిందని మండిపడ్డారు. పంటలు ఎండిపోతున్నా రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ఎండిన వరి పంటకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, కొనుగోలు కొనుగోళ్లు ప్రారంభం అయినందున ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని, లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా అధ్యక్షుడు జడల అమరేందర్, జిల్లా రైతు కోఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, పార్టీ భువనగిరి పట్టణ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మొగ్గుళ్ల శ్రీనివాస్, మాద శంకర్‌గౌడ్, రమేష్, ఇట్టబోయిన గోపాల్, బబ్లూ, ర్యాకల శ్రీనివాస్, అబ్బగాని వెంకట్, పుట్ట వీరేష్, సుభాష్, శివ,బిక్షపతి, రఘునాథ్, చౌదరి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



టిఫిన్ బైటక్ కార్యక్రమంలో భాగంగా భువనగిరిలో అల్పాహారం తీసుకుంటున్న బీజేపీ నాయకులు

బీజేపీతోనే దేశ అభివృద్ధి, రక్షణ

- పార్టీ ఆవిర్భావ సభలో జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్

సాక్షి, యాదాద్రి : దేశ అభివృద్ధి, రక్షణ కోసం బీజేపీని మరోసారి గెలిపించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ పేర్కొన్నారు. శనివారం బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భువనగిరిలోని పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి మాట్లాడారు. ఆవిర్భావంనుంచి పార్టీ ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొందని, నేడు ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, లాల్‌కృష్ణ అద్వానీ లాంటి జాతీయనేతలు పార్టీ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడ్డారని, వారు చూపిన బాటలో మనం పయనించాలన్నారు. మోదీ నాయకత్వంలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకొని దేశంలో మరోమారు అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. భువనగిరి నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయాలని, బూర నర్సయ్య గౌడ్‌ను విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందామహేందర్ గుప్తా, ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్, నాయకులు పాదరాజు ఉమాశంకర్, ఉడుత భాస్కర్, రమేష్, రత్నపురం బలరాం, శ్రీశైలం, ఎంగిలి లక్ష్మణ్, ఎదగాని సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ‘టిఫిన్ బైటక్’

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శక్తి కేంద్రాల్లో టిఫిన్ బైటక్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అల్పాహారం తీసుకున్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాలను పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. భువనగిరిలో బీజేపీ సీనియర్ నాయకులు బొబ్బ్ర నందయ్య, వీరమల్ల లక్ష్మయ్య, పోకల ఎట్టయ్య, సిరిపంగ మైసయ్యను సన్మానించారు.

ఎవరికి వారే..!

కాంగ్రెస్ నాయకుల మధ్య సయోధ్యలేమి

- భువనగిరి లోక్‌సభ స్థానంలో ఇంకా మొదలుకాని ప్రచారం
- టికెట్ ఖరారై పది రోజులైనా నేతలతో వేదిక పంచుకోని అభ్యర్థి
- ఎమ్మెల్యేలపైనే గెలుపు భారం
- కోమటిరెడ్డి బ్రదర్స్ వ్యూహాత్మక మౌనం
- అంటీముట్టనట్లుగా ఇతర ముఖ్య నేతలు



సాక్షి, యాదాద్రి : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య ఇంకా సయోధ్య కుదరడం లేదు. భువనగిరి ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డ పలువురు కీలకనేతలు తమకు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతుండగా.. బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేష్ సైతం దూకుడు పెంచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఖరారై పది రోజులు కావస్తున్నా పార్టీ నేతలతో ఉమ్మడి వేదిక పంచుకోలేదు. అభ్యర్థిని ప్రకటించిన తరువాత జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భువనగిరి వైపు కన్నెత్తి కూడా చూడలేదు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా మునుగోడు అసెంబ్లీ సెగ్మెంట్‌కే పరిమితం అయ్యారు.

ఎమ్మెల్యేలు ఉన్నారన్న ధీమా!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా గుర్తింపు ఉన్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి పరిచయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ క్రమంలో తన గెలుపు బాధ్యతలను ఎమ్మెల్యేలపై వేసినట్లు తెలుస్తోంది. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. ఇందులో జనగామ మినహా మిగతా ఆరు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా కిరణ్‌కుమార్‌రెడ్డి తనకు టికెట్ ఖరారైన తరువాత ఆరుగురు ఎమ్మెల్యేలు, జనగామ నియోజకవర్గ ఇంచార్జ్‌ను కలిసి తన గెలుపునకు సహకరించాలని కోరారు. అయితే క్యాడర్‌ను సమన్వయం చేసే డీసీసీ అధ్యక్షుడు, పీసీసీ డెలిగేట్లు, ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్య నేతలు, సీనియర్లను కలిసిన దాఖలాలు లేవు. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో, అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ సన్నాహక సమావేశాలు మొదలుపెట్టలేదు. అయినా ఎంపీ అభ్యర్థి గెలుపుపై ధీమాతో ఉన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తనకోసం పనిచేసే క్యాడర్ ఉందని, పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని, వారే ఎన్నికల బాధ్యత చూసుకుంటారన్న ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో తనకు బలమైన క్యాడర్ ఉన్నందున ఆ రెండింటి పర్యవేక్షణ తాను చూసుకుంటానని అన్నట్లు ఓ నాయకుడు చెబుతున్నాడు. దీంతో పాటు ఆరు గ్యారంటీపైనా ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఎన్నికలకు మరో 36 రోజులే గడువు ఉండడం, ఇప్పటి వరకు ప్రచారాన్ని ప్రారంభించకపోవడంతో పార్టీలో ఏం జరుగుతుందోనని కాంగ్రెస్ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

బ్రదర్స్.. సైలెన్స్!

ఎంపీగా ఉన్న సమయంలో నిత్యం జిల్లాలో పర్యటించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. అభ్యర్థిని ఖరారు చేసిన తరువాత ఇటువైపు రాకపోవడం చర్చకు తావిస్తోంది. మొన్నటి వరకు ఆయనే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇటీవల కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఇన్‌చార్జిగా ఏఐసీసీ నియమించింది. ఇన్‌చార్జిగా కీరోల్ పోషించవలసిన రాజగోపాల్‌రెడ్డి కూడా నియోజకవర్గానికి దూరంగానే ఉన్నారు. అయితే ఇటీవల మునుగోడు నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం ఖాయమని ఆయన ప్రకటించారు. మొత్తంగా కోమటిరెడ్డి బ్రదర్స్ వ్యూహాత్మక మౌనం పాటిస్తుండడం చర్చకు దారితీస్తోంది.

పార్టీలో గుర్తింపు లేదని సీనియర్ల అసంతృప్తి

పార్టీలో మొదటి నుంచి ఉన్న నాయకులు అసంతృప్తితో ఉన్నారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించామని, పదేళ్లు అధికారంలో లేకున్నా వెన్నుదన్నుగా నిలిచామని సీనియర్లు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. తుక్కుగూడ బహిరంగ సభ నేపథ్యంలో జరిగిన సన్నాహక సమావేశాల్లో బహిరంగంగానే అసంతృప్తి వెలిబుచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలో జరిగిన సమావేశంలో యాదగిరిగుట్ట పట్టణ, మండల అధ్యక్షులతో వాగ్వాదానికి దిగాను. తమను పార్టీ సభలకు జనాలను తరలించడానికి, జెండాలు కట్టడానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో మరికొన్ని చోట్ల బయట పడకుండా లోలోపల అసమ్మతి నెలకొంది. ఎన్నికల వేళ వీటన్నింటిని చక్కబెట్టి నాయకులను ఏకతాటిపైకి తెచ్చే నాథుడే లేడు.

భానుడు @ 43.8

- మోత్కూరు, గుట్టలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు
- బెంబేలెత్తుతున్న జనం



భువనగిరి టౌన్ : జిల్లాలో శనివారం ఎండ తీవ్రత మరింత పెరిగింది. మోత్కూరు, యాదగిరిగుట్ట పట్టణంలో ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయిలో 43.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. వలిగొండ, ఆలేరులో 43.3, భువనగిరిలో 42.5 డిగ్రీలు, మిగతాఅన్ని మండలాల్లోనూ 41 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యాయి. ఎండ తీవ్రత రోజురోజూ పెరుగుతుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు తారెత్తిస్తుండడంతో బయటకు వెళ్లాలంటనే బయపడుతున్నారు. చాలా మంది అత్యవసరం అయితే తప్ప.. సాయంత్రం వరకు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. కూలీలు చల్లపూట పనులు ముగించుకొని 12 గంటల లోపే ఇళ్లకు చేరుతున్నారు. ఎండకు తోడు రానున్న రెండు రోజులు వడగాడ్పు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి మారుతీదేవి

బీబీనగర్ : మనిషి ఆరోగ్యంగా ఉంటేనే ఏ పని అయినా చేయగలుగుతాడని, అందుకే ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతీదేవి పేర్కొన్నారు. బీబీనగర్ మండలంలోని రహీంఖాన్‌గూడలో శనివారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో భారత్ రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వైద్యశాఖ సంయుక్తంగా ప్రజారోగ్య సమస్యలు, పరిష్కారాల కోసం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, తరచూ ఆస్పత్రులు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కె.దశరథ రామయ్య, డి.నాగేశ్వర్‌రావు, సి.హరినాథ్‌బాబు, షేక్ అమీర్ పాషా, దిడ్డి బాలాజీ, రహీం, మండల వైద్యాధికారి డాక్టర్ యాదగిరి, వివేరా హోటళ్ల చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రావొద్దు

- కలెక్టర్ హనుమంతు కే. జెండగే

సాక్షి,యాదాద్రి : వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జండగే అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమై తాగునీటి సరఫరాపై సమీక్షించారు. మిషన్ భగీరథ నీళ్లతో పాటు బోర్లు, చేతి పంపుల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. అంతేకాకుండా వార్డుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, రోజువారీ అవసరాలకు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సరఫరాలో సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న ప్రతి బోరును వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. బోర్లు, చేతిపంపులు, పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్), గ్రామ పంచాయతీ నిధులు, సంబంధిత శాకల నిధులు వినియోగించుకోవాలని కోరారు. తాగునీటి పంపిణీకి సంబంధించి ఏరోజుకారోజు నివేదిక అందజేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీపీఓ సునంద, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

వాగు వట్టిపోయి.. పైరు ఎండిపోయి



బీబీనగర్ పరిధిలో వట్టిపోయిన చిన్నేటి వాగు



ముగ్దుంపల్లి, గొర్లగూడెం గ్రామాల్లో ఎండిన పొలాలు

- ఐదేళ్ల తరువాత పూర్తిగా వట్టిపోయిన చిన్నేటివాగు
- నిరుపయోగంగా మారిన బోర్లు
- వెయ్యి ఎకరాలకు పైగా ఎండిపోయిన వరి పొలాలు

బీబీనగర్ : ఐదారేళ్లుగా తడారని బీబీనగర్ మండలంలోని చిన్నేటి వాగు నేడు ఎడారిని తలపిస్తోంది. పూర్తిగా వట్టిపోవడంతో బోర్లు అడుగంటాయి. వాగులో రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లు నిరుపయోగంగా మారాయి. నీరందక వెయ్యి ఎకరాలకు పైగా వరి పైరు ఎండిపోయింది.

రైతులకు ప్రధాన సాగునీటి వనరు

బీబీనగర్ మండల రైతులకు చిన్నేటివాగు ప్రధాన సాగునీటి వనరుగా ఉంది. బీబీనగర్, అన్నంపట్ల, ముగ్దుంపల్లి, గొల్లగూడెం, రావిపహాడ్, భువనగిరి మండలంలోని అనాజిపురం గ్రామాల పరిధిలో వాగు ప్రవహిస్తోంది. చిన్నేటివాగు నిండుకుండలా ఉండడంతో దాన్ని నమ్ముకొని వందలాది మంది రైతులు 20 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. ప్రధానంగా గొల్లగూడెం, రావిపహాడ్, ముగ్దుంపల్లి గ్రామాల పరిధిలో బోర్లు పడకపోవడంతో రైతులు వాగునీటిపైనే ఆధారపడుతుంటారు. వాగులో మోటార్లు ఏర్పాటు చేసుకొని పైపులైన్లు వేసుకొని వరి సాగు చేశారు.కానీ, వాగు వట్టిపోయి బోర్లల్లో నీటి లభ్యత లేకపోవడంతో వరి పొలాలు ఎండిపోతున్నాయి.

బునాదిగాని కాల్వకు తగ్గిన మూసీ నీరు

మక్తాఅనంతారం నుంచి మొదలయ్యే బునాదిగాని కాల్వనుంచి మూసీ జలాలు యర్రబెట్టితండా వద్ద చిన్నేటివాగులోకి చేరుతాయి. బునాదిగాని కాల్వకు మూసీనుంచి నీరు తగ్గడంతో వాగు వట్టిపోయింది.

వాగులో 200 పైగా మోటార్లు ఏర్పాటు

చిన్నేటివాగులో ఆయకట్టు రైతులు 200 వరకు పైగా మోటార్లు ఏర్పాటు చేసుకొని పొలాలకు నీరందిస్తున్నారు. కానీ, వాగు పూర్తిగా ఎండిపోవడంతో మోటార్లు నిరుపయోగంగా మారాయి. చిన్నేటి ఆయకట్టులో సుమారు 20వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా ప్రస్తుతం నీరందక వెయ్యి ఎకరాల్లో పంట ఎండిపోయింది. దీంతో పెట్టుబడి కూడా వెళ్లే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట మొత్తం ఎండిపోయింది



చిన్నేటివాగులో మోటారు ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా పొలానికి నీరు పారిచ్చుకుంటున్నాం. వాగును నమ్ముకొని రెండు ఎకరాల్లో వరి వేశా. వాగులో నీరు లేకపోవడంతో పొలంపూర్తిగా ఎండిపోయింది.

–మేకల నర్సింహ, గొల్లగూడెం

బోర్లు పోస్తలేవు



బునాదిగాని కాల్వ ద్వారా చిన్నేటి వాగులోకి నీరు వస్తలేదు. దీనికి తోడు కాల్వ మొదట్లో కొందరు రైతులు పెద్ద మోటార్లు ఏర్పాటు చేయడంతో మా వరకు నీరు రావడం లేదు.బోర్లు పోయక పొలం పూర్తిగా ఎండింది.

–రమేష్‌యాదవ్, గొల్లగూడెం

క్లుప్తంగా

బావిలోకి దూసుకెళ్లిన కారు

- నలుగురు యువకులకు స్వల్పగాయాలు



బావిలో పడిన కారు

మునుగోడు: కారు అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లడంతో నలుగురు యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధ రాత్రి దాటక మునుగోడులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్‌నారయణ పురం మండలం పుట్టపాకకు చెందిన ఇద్దరు యువకులతో పాటు సర్వేల్‌కి చెందిన యువకుడు, చిన్నకాపర్తికి చెందిన మరో యువకుడు కలసి మునుగోడు మండలంలోని జమస్థాన్‌పల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుడు పుట్టిన రోజు వేడుకలకు శుక్రవారం హాజరైయ్యారు. అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి రాత్రి 1 గంటల సమయంలో బయలుదేరారు. అయితే, అందులో చిన్నకాపర్తి గ్రామానికి చెందిన యువకుడిని ఆ గ్రామంలో దింపేందుకు మునుగోడు మీదుగా నార్కట్‌పల్లి రోడ్డు నుంచి వెళ్తుండగా మార్గ మధ్యలో కార్మికనగర్ సమీపంలోని మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి నేరుగా వెళ్లడంతో అక్కడే ఉన్న పడావు బావిలో పడిపోయింది.ప్రమాదంలో నలుగురు యువకులకు స్వల్పగాయాలయ్యాయి. బావిలో పడిపోయామని గమనించిన ఆ యువకులు తమ స్నేహితులకు ఫోన్‌చేసి అక్కడికి రప్పించుకొని తాడు సహాయంతో బయటకు వెళ్లి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్లు పట్టివేత

హాలియా : పట్టణంలోని అంగడి బజార్‌లో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన డెమోస్టిక్ గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లయీస్ అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లయీస్ డీటీ ముక్తార్, ఆర్‌ఐ సుస్మిత ఆధ్వర్యంలో శనివారం హాలియా పట్టణంలోని అంగడి బజార్‌లో నివాసం ఉంటున్న గందె మహేష్ ఇంటిపై దాడులు నిర్వహించారు. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న ఆరు సిలిండర్లుతో పాటు దీపావళి టపాసులను స్వాధీనం చేసుకుని గందె మహేష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న దీపావళి టపాసులను హాలియా ఫైర్ స్టేషన్ సిబ్బందికి అప్పగించారు.

హఫీజ్‌కు ఉగాది పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న హఫీజ్

కనగల్: కనగల్ మండల కేంద్రానికి చెందిన మాజీ కో ఆప్షన్ సభ్యుడు హఫీజ్ గాన కళ, సంఘ సేవా రంగాల్లో అందించిన సేవలకు శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కారం దక్కింది. శనివారం హైదరాబాద్‌లోని శ్రీ శారద కల్చరల్ లైవ్ స్టూడియో శ్రీ ముఖి కాంప్లెక్స్ హిమాయత్‌నగర్‌లో హఫీజ్ ఈ పురస్కారం అందుకున్నాడు.

బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు



ధ్వంసమైన ఇంటి లోపలి భాగం



గాయపడిన నిర్వాహకుడు కోటేశ్వరరావును ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు



చిట్యాలలో బాణసంచా పేలుడు జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- చిట్యాల పట్టణంలో ఘటన

చిట్యాల: బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించటంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా చిట్యాలలో శనివారం చోటు చేసుకుంది. డీఎస్పీ శివరాంరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన కోటేశ్వరరావు చిట్యాల మున్సిపాలిటీలోని సంతోష్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అనుమతులు లేకుండా పిల్లలు వాడే బాణసంచా (పాప్‌ఆప్ బాంబులు) తయారు చేస్తున్నాడు. కాగా శనివారం యాథావిధిగా బాణసంచాను తయారు చేస్తుండగా అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నిర్వాహకుడు కోటేశ్వరావు చేయి తెగిపడి తీవ్రంగా గాయపడగా పనిచేస్తున్న చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన గుడిసె శాంతికి చేతికి, మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాకు చెందిన బానోతు సైదమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా మరో ఇద్దరు ఉన్నప్పటికీ వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు.

బాంబ్ డిస్పోజల్ టీం పరిశీలన..

ప్రమాద సంఘటన జరిగిన ఇంటిని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి పరిశీలించారు. జరిగిన ప్రమాదం వివరాలను నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ డి.సైదాబాబుతో పాటు ప్రమాదంలో గాయపడిన వారిని, పనిచేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాదం జరిగిన ఇంటిని బాంబు డిస్పోజల్ టీం సభ్యులు ఆఫీజ్, ఫరీద్‌ల, డాగ్ టీం సభ్యుడు సంపత్‌తో పాటు క్లూ టీం సభ్యులు బాణసంచా తయారీలో వాడిన వాడిన పదార్థాలను పరిశీలించి, శాంపిల్స్‌ను సేకరించారు.

ఇంట్లోనే బాణసంచా తయారీ..

కోటేశ్వరావు కొంత కాలంగా చిట్యాలలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మరో నలుగురు మహిళలతో పనిచేపించుకుంటూ బాణసంచా తయారు చేస్తున్నాడు. పేలుడులో ఉపయోగించే రెండు రకాలైన తెలుపు రంగులో, గోధుమరంగులోని (పాస్పరస్‌గా భావిస్తున్నారు) రసాయన ముడి పదార్థాలను వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వాటిని అద్దెకు ఉన్న ఇంట్లోనే మిక్సీలలో వేసి పౌడర్‌గా తయారు చేస్తున్నారు. అనంతరం ఆ పేలుడు పదార్థాల పౌడర్‌తో పాటుగా గులకరాళ్లను పేపర్ చుట్టి ప్యాకింగ్ చేసి పిల్లలు వాడుకునే బాణసంచా (పాప్‌ఆఫ్ బాంబులు)లను తయారు చేస్తున్నాడు. వీటిని స్థానికంగా గల వ్యాపార దుకాణాలతో పాటుగా ఇతర ప్రాంతాలకు రవాణా చేసి విక్రయిస్తున్నాడు. ఈ పేలుడు బాణసంచా పదార్థాల పౌడర్ చేసి పేపర్‌పై ఉంచితే తాము గులకరాళ్లతో కలిపి తెల్లటి పేపర్‌లో ఉండలుగా చుట్టి తయారు చేస్తున్నట్లు ఆ బాణసంచా కేంద్రంలో జరిగిన ప్రమాదం నుంచి బయటపడిన మహిళ పోలీసులకు తెలిపింది. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

వాడపల్లి శివార్లలో గుట్టుగా జూదం

- నిత్యం చేతులు మారుతున్న రూ.లక్షలు
- దేవరకొండ మాల్, మిర్యాలగూడకు చెందిన కేటుగాళ్ల కనుసన్నల్లో దందా
- జూదరులకు కొందరు ఖాకీల అండదండలు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలో పెద్ద ఎత్తున పేకాట స్థావరాలు నడుస్తున్నాయని తెలుస్తోంది. నిత్యం ఆంధ్రా, తెలంగాణ నుంచి పేకాటరాయుళ్లు అక్కడకు చేరుకుని దర్జాగా పేకాట కొనసాగిస్తున్నారని, నిమిషాల వ్యవధిలోనే వేలాది రూపాయలు చేతులు మారుతూ కొందరి జేబులు నిండుతూ... మరికొందరి జేబులు ఖాళీ అవుతూ కొనసాగుతుందని సమాచారం. ఈ దందా దేవరకొండ మాల్ ప్రాంతం నుంచి వలస వచ్చిన ఒకరు, మిర్యాలగూడలోని సెల్‌షాపు నిర్వహిస్తున్న మరొకరి కనుసన్నల్లో జరుగుతుండగా దీనికి సమీప పోలీస్ స్టేషన్‌లోని కొందరు కిందిస్థాయి సిబ్బంది కూడా సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోజూ వారీ వేతనం చెల్లిస్తూ..

వాడపల్లికి ఒకవైపు మూసీ నది మరోవైపు కృష్ణానది పరీవాహక ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతం కూడా ఉండడం, వీటికితోడు ఇర్కిగూడెం రోడ్డులో పడావుబడిన పాలిష్ మిల్లులు, దామరచర్ల శివారులో శిథిలమైన ఓ రసాయన కర్మాగారం, సమీపంలోని అటవీ ప్రాంతాలను అడ్డాలుగా మారుస్తూ కొంతకాలంగా జోరుగా పేకాట దందా నడిపిస్తున్నట్లు సమాచారం. పకడ్బందీ ఏర్పాట్లతో పోలీసుల రాకను పసిగట్టేందుకు కొందరు యువకులను రోజువారీ వేతనం చెల్లిస్తూ స్థావరానికి ఇరువైపులా ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా దందా నడిపిస్తున్నట్లు ఆరోపణలు అవుతున్నాయి. గతంలో కూడా దామరచర్ల మండల కేంద్రంలోని రైస్ మిల్లుగా మారిన ఓ పాలిష్ మిల్లులో యథేచ్ఛగా దందా నడవడంతో అప్పటి పోలీసులు కట్టడి చేసిన సంఘటనలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన స్టేషన్ అధికారి కనుసన్నల్లోనే అప్పటి అధికార పార్టీకి చెందిన నాయకులు కొందరుదందాను కొనసాగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ తరువాత కొంతకాలం వారు దందాను మానివేసినప్పటికీ దేవరకొండ ప్రాంతానికి చెందిన ఒక కేటుగాడు సదరు పోలీసు అధికారితో కుమ్మక్కై గతంలో కూడా ఇక్కడ దందా నిర్వహించారని, ప్రస్తుతం అధికార పార్టీ మారినప్పటికీ, గతంలో పనిచేసిన పోలీసు అధికారి బదిలీ అయినప్పటికీ అదే పోలీసు స్టేషన్‌లో గతంలో కేటుగాడితో అంటకాగిన కొందరు సిబ్బంది కొత్తగా వచ్చిన స్టేషన్ బాస్ కదలికలను ఎప్పటికప్పుడు అందచేస్తూ పేకాట దందారాయుడికి సహకరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవైపు ఎన్నికల కోడ్ అమలవుతున్నప్పటికీ రూ.50వేల లోపు నగదు తీసుకొచ్చే అవకాశం ఉండడం, ఒకవేళ చాలకపోయినా దామరచర్ల మండల కేంద్రంలో కమీషన్‌పై ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు తీసి ఇచ్చే అవకాశం ఉండడంతోపాటు కొందరు ఈ కమీషన్ వ్యాపారంపైనే నిత్యం వేల రూపాయలు సంపాదిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పేకాటకు బానిసలై లక్షల రూపాయలు పోగొట్టుకుని చాలా మంది జీవితాలు రోడ్డున పడుతున్నాయని, అధికారులు దృష్టి సారించి పేకాట దందాను కట్టడి చేయాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పలు ఇళ్లలో చోరీకి విఫలయత్నం



నేరేడుచర్లలోని ఓ ఇంటి వద్ద సీసీ కెమెరాల్లో రికార్డయిన గుర్తుతెలియని వ్యక్తుల చిత్రాలు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్‌లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు పలు ఇళ్లలో చోరీలకు ప్రయత్నించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లలోని విద్యానగర్‌లో ఉంటున్న ఇరువంటి శ్రీపాద శర్మ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించాడు. శ్రీపాదశర్మ భార్య అరవిందసాయి మెడలో గల బంగారు పుస్తెల తాడును గుంజుకునేందుకు ప్రయత్నించగా ఆమె ఎదిరించడంతో నిందితుడు పరారయ్యాడు. శ్రీపాద శర్మ రోజు మాదిరిగానే దేవాలయానికి వెళ్లగా ఉదయం 11గంటల సమయంలో ఇంట్లో అరవింద సాయి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తనకు చెవుడు అంటూ సైగల్ చేస్తూ ఓ కాగితంపై ఏదో రాసుకొని వచ్చి చూపించే ప్రయత్నం చేశాడు. ఎవరు నువ్వు అంటూ నిలదియడంతో గేటు వద్దకు వెళ్లాడు. గేటు వద్దకు వెళ్లతూ ఒక్కసారిగా మీదకు వచ్చి బంగారు పుస్తెలతాడు దొంగలించే ప్రయత్నం చేశాడు. అక్కడే ప్లాస్టిక్ స్టూల్ ఉండటంతో ఆ స్టూల్ అందుకొని అతనిపై దాడికి దిగింది. అరవిందసాయి కేకలు వేయడంతో చుట్టు పక్కల మహిళలు అక్కడి చేరుకోవడంతో గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. సదరు వ్యక్తి అదే కాలనీలో నివాసం ఉంటున్న కట్టా లచ్చిరెడ్డి ఇంట్లోకి వెళ్లి దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తుండగా వెంటబడటంతో పరారయ్యాడు. ఈ సంఘటన కూడా సీసీ కెమెరాల్లో కూడా చోటు చేసుకుంది. ఈ విషయంపై తెలుసుకున్న పోలీసులు నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.

పురుగుల మందు కలిపిన నీరు తాగి ఆవులు మృతి



ఆవుల కళేబరాలు

చందంపేట: పురుగుల మందు కలిపిన నీరు తాగి పదకొండు ఆవులు మృతిచెందాయి. ఈ సంఘటన నేరెడుగొమ్ము మండలం బచ్చాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బచ్చాపురం గ్రామానికి చెందిన కెతావత్ వెంకట్రాం, మోతీలాల్, కిషన్, మోహన్, హర్యాలకు చెందిన పదకొండు ఆవులు మేతకు వెళ్లి అదే గ్రామానికి చెందిన కేతావత్ సతీష్ ఆయిల్‌ఫాం తోటలోకి వెళ్లాయి. అక్కడ డ్రమ్ములో తోటకు పిచికారీ చేయటానికి ఉంచిన క్రిమి సంహారక మందు కలిపిన నీటిని తాగి మృతి చెందినట్లు రైతులు పేర్కొన్నారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. పశువైద్యాధికారి ఆధ్వర్యంలో నాలుగు ఆవులకు పోస్టుమార్టం నిర్వహించగా, మరికొన్నింటికి ఆదివారం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాకే అనుమతులివ్వాలి

- స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు



ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు

గరిడేపల్లి : పరిశ్రమల ఏర్పాటుతో గ్రామాలకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించిన తర్వాతనే వాటి ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని గరిడేపల్లి మండలంలోని సర్వారం, లక్ష్మీపురం, అబ్బిరెడ్డిగూడెం గ్రామస్తులు అధికారులను కోరారు. మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీ పరిధిలో15 సంవత్సరాల క్రితం నెలకొల్పిన శ్రీనివాస ఎడిఫైస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌ఇపీఎల్) మైనింగ్ ప్రాంత విస్తరణ అనుమతులకు శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ శివారులోని గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ పరిశ్రమలో చేపడుతున్న బ్లాస్టింగ్, దుమ్ముతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పరిశ్రమ నెలకొల్పిన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఇప్పుడు మళ్లీ అనుమతులు పొడిగించేందుకు అధికారులు నిర్ణయం తీసుకునే ముందు మా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా పరిశ్రమ పక్కనే ఉన్న పొలాలను, ప్రజలకు కాలుష్యం నుంచి రక్షణ కల్పించాలని, బ్లాస్టింగ్ సమయంలో ఇండ్ల బీటలు బారకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వీటిపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల వారికి అవకాశం ఇస్తున్నారని ఆరోపించారు. పలువురు ఎన్‌జీఓలు మాట్లాడుతూ కంకర మిల్లులు కట్టిన టాక్స్‌లు డీఎంఎఫ్‌టీ, సీఎస్‌ఆర్ నిధులు చుట్టుపక్కల గ్రామాలకు వినియోగించటం లేదని, ఆ నిధులను పరిశ్రమ పరిధిలోని గ్రామాలకు కేటాయించాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జిల్లా ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సురేష్‌బాబు మాట్లాడుతూ సమావేశంలో మొత్తం 46మంది మాట్లాడారని, కార్యక్రమాన్ని రికార్డింగ్ చేశామని వీటిని పర్యావరణ, అడువులు, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖలకు పంపుతామని తెలిపారు. హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ కవిత, హుజూర్‌నగర్, మునగాల సీఐలు చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు ఈట సైదులు, రవీందర్‌నాయక్, ముత్తయ్య, లక్ష్మీనర్సయ్య, అనిల్‌రెడ్డి, నవీన్, గరిడేపల్లి ఎస్-2 నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.6లక్షల నగదు పట్టివేత



డబ్బులు స్వాధీనం చేసుకుంటున్న ఎస్‌ఐ



నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

చింతపల్లి : హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై మండల కేంద్రంతో పాటు పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్ చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మండల కేంద్రంలోని సాయిబాబా దేవా లయం వద్ద నసర్లపల్లికి చెందిన మల్గం వెంకటయ్య నుంచి రూ.లక్ష, మాల్ వెంకటేశ్వరనగర్ చెక్ పోస్టు వద్ద దేవరకొండ మండలం మడమడక గ్రామానికి చెందిన నారబోయిన శ్రీకాంత్ నుంచి రూ.5లక్షలు సీజ్ చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా డబ్బులు తీసుకెళ్తుండడంతోనే నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

నార్కట్‌పల్లిలో రూ.4లక్షలు స్వాధీనం

నార్కట్‌పల్లి : ఆధారాలు లేకుండా డబ్బు తరలిస్తున్న మహిళ సంఘం సభ్యుల నుంచి రూ. 4 లక్షలను నార్కట్‌పల్లి పోలీసులు శనివారం మండల కేంద్రంలో స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న నారాయణపురం గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యులు బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసుకొని స్వగ్రామానికి ఆటోలో వెళుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు వారి నుంచి రూ.4 లక్షలు స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

వివిధ కేసుల్లో పలువురికి జరిమానా

హుజూర్‌నగర్ : వివిధ కేసుల్లో పలువురికి జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ శనివారం తీర్పు చెప్పారు. హుజూర్‌నగర్‌కు చెందిన పెద్ద వెంకయ్యకు చెందిన గేదె స్థానిక వెంకట సాయి రైస్ మిల్ వద్ద యజమాని వెంకటేశ్వర్లు ఏర్పాటు చేయించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల విద్యుత్ షాక్ కు గురై మరణించినదని ఆరోపిస్తూ 2017 జూన్‌లో పెట్టిన కేసులో నిందితుడు నేరాన్ని అంగీకరించారు. దీంతో న్యాయమూర్తి అతనికి రూ.1,500 జరిమానా విధించారు. మరొక కేసులో పట్టణానికి చెందిన గుండెల్లి శాంతమ్మ, భర్త శాంతయ్యలను పట్టణానికి చెందిన ములకలపల్లి నరసయ్య, భార్య కనకమ్మలు దుర్భాషలాడి బెదిరించిన కేసులో నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో ఇరువురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మరో కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట మండలం బండిపాలెంకు చెందిన కొరప్రాటి రత్తయ్య మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ పులిచింతల ప్రాజెక్టు వద్ద పోలీసులకు పట్టుబడిన కేసులో నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతనికి రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మారుతీ ప్రసాద్ తీర్పు చెప్పారు.

పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఐదేళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేదలకు 126 గజాల ఇంటి స్థలం పట్టాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్.లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ శివారు సర్వేనంబర్ 126 ప్రభుత్వ భూమిలో, నేరేడుచర్ల మున్సిపాలిటీ శివారు సర్వేనంబర్ 243, 244 ప్రభుత్వ భూమిలో గత ఐదేళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. గతంలో అనేకమార్లు అప్పటి మంత్రి జగదీష్‌రెడ్డికి, అప్పటి హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డికి విన్నవించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. గుడిసెలను తొలగించి పేదలపైన, పార్టీ నాయకులపైన కేసులు పెట్టారని తెలిపారు. ఇదే విషయమై మార్చి 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాలు ఇవ్వగా ఎంక్వయిరీ చేసి అర్హులైన వారికి పట్టాలివ్వాలని కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారన్నారు. ఇప్పటికైనా దీనిపై కలెక్టర్ స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వాజిద్, పార్టీ నాయకులు పిడమర్తి లింగయ్య, పీవైఎల్ నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిరుత కలకలం

చందంపేట : మండలంలోని నక్కల గండి ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు పశువుల కాపరులు తెలిపారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ సాయి ప్రకాష్ పేర్కొన్నారు. పశువుల కాపరులు ఈ ప్రాంతంలో ఒక్కొక్కరుగా తిరగకుండా ఒక నలుగురైదుగురు కలిసి ఉండాలని సూచించారు.

చీడ పీడలు నివారిస్తేనే అధిక దిగుబడులు


- హాలియా ఇన్‌చార్జ్ ఏడీఏ సందీప్‌కుమార్



సందీప్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏడీఏ, హాలియా



పెద్దవూరలో సాగవుతున్న వేరుశనగ



పెద్దవూర: ఈ ఏడాది యాసంగి సీజన్‌లో రైతులు ఆరుతడి పంటగా అధిక విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. ఉష్ణోగ్రతలలో మార్పులు వస్తుండటంతో సాగులో చీడపీడలు, పోషకలోపాలు తలెత్తున్నాయి. జాగ్రత్తలు తీసుకుంటే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని హాలియా ఇన్‌చార్జ్ ఏడీఏ ఏ.సందీప్‌కుమార్ తెలుపుతున్నారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు ఎరువులు, మందులు వాడితే లాభాల బాట పట్టవచ్చునని చెబుతున్నారు.

పచ్చపురుగు బెడద..

రబీలో శనగపచ్చ పురుగు బెడద అధికంగా ఉంటుంది. మార్చి నెల వరకు ఈ పురుగుల ఉధృతి ఉంటుంది. ఆకుల వెనక రెక్కలు పాలిపోయిన తెలుపు రంగుతో నల్లని అంచు కలిగి ఉంటాయి. గుడ్డు లేదా దాని నుంచి వెలువడిన పిల్ల పురుగులు లేదా ఆకుపచ్చ రంగులో పెరిగిన పురుగులు ముదురు ఆకుపచ్చ రంగు నుంచి గోధుమ రంగులోకి మారతాయి. నల్లని తల ఉన్న చిన్న పురుగులు హరితాన్ని పువ్వు మొగ్గలు, రేకులను గీకి తింటాయి. తర్వాత మొగ్గలు, పువ్వులు కాయలను తొలిచి తిని డొల్ల చేస్తాయి. ఒకే పురుగు చాలా కాయలను నష్టపరుస్తుంది. వేరుశనగ పంట లేతగా ఉన్నప్పుడు ఇవి ఆకులను తిని నాశనం చేస్తాయి. కాయలకు గుండ్రటి రంధ్రాలు చేసి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఈ పురుగును నివారించవచ్చు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. గుడ్లు, చిన్న పురుగుల నివారణకు ఐదు శాతం వేపనూనెను పంటకు పిచికారీ చేయాలి. ఎన్‌పీవీ ద్రావణాన్ని(వైరస్ ద్రావణం) ఎకరానికి 250 ఎల్‌ఈ తగినంత నీటిలో కలిపి సాయంత్రం సమయంలో పిచికారీ చేయాలి.

వేరుశనగలో సూక్ష్మ పోషకాలు..

వేరుశనగ మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషక పదార్థాలు అవసరం. వీటిలో ముఖ్యమైన పోషకాలైన క్యాల్సియం, సల్ఫర్, జింక్, ఇనుము వేరుశనగ పంటకు చాలా అవసరం. ఇవి మొక్కలకు తగినంత అందనప్పుడు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కాల్షియం..

మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే ఎంజైములను ఉత్తేజపరచడానికని వేర్ల అభివృద్ధికి బాగా తోడ్పడుతుంది. తాలు కాయలు ఏర్పడకుండా గింజలు లావుగా ఉండి కాయ నాణ్యత పెరిగేందుకు దోహదం చేస్తుంది. వేరు చివరి భాగం నశించి పెరుగుదల ఆగిపోతుంది. ఆకుల్లో పచ్చదనం లోపిస్తుంది. ఆకుల కాండం విరుగుతుంది. కంచు రంగుకు మారి చిగుర్లు వంకరలు తిరుగుతాయి. వేర్ల అభివృద్ధి దెబ్బతిని బుడిపెల సంఖ్య తగ్గుతుంది. కాల్షియం లోప నివారణకు ఎకరాకు 200 కిలోల జిప్సమ్‌ను తొలి పూత దశలో అంటే విత్తిన 40 రోజులకు మొక్క మొదళ్ల దగ్గరికి ఎగదోయాలి. జిప్సం వేసిన తరువాత నీరు పెట్టాలి.

గంధకం..

గంధకం నూనె శాతం పెరగడానికి కాయలు మంచి రంగును కలిగి ఉండేందుకు కాయ గింజ బరువు పెరగడానికి దోహదపడుతుంది. నేల నుంచి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను ఎక్కువ పరిమాణంలో మొక్క తీసుకోవడానికి గంధకం దోహదం చేస్తుంది. ఊడల నుంచి కాయలు తెగిపోకుండా కాపాడుతుంది. వేర్లలో రైజోబియం బుడిపెలు ఏర్పడడానికి సహకరిస్తుంది. గంధకం లోపిస్తే కొత్త ఆకులలో లోప లక్షణాలు కనిపిస్తాయి. ఆకుల ఈనెలు పసుపు రంగుకు, లేత ఆకులు పసుపు పచ్చగా మారతాయి. ముదురు ఆకులు మార్పు లేకుండా ఆకుపచ్చగా ఉంటాయి. వీని నివారణకు అమ్మోనియం సల్ఫేట్, సూపర్ ఫాస్ఫేట్, పొటాషియం సల్ఫేట్ వంటి ఎరువులు వాడాలి. గింజల్లో నూనె శాతం పెరగడానికి విత్తిన 40 రోజులకు జిప్సం వాడాలి.

ఇనుము..

ఈ పోషకం లోపించినప్పుడు ఆకులు పసుపు పచ్చగా మారుతాయి. తర్వాత ఆకు మొత్తం పసుపు రంగుకు మారుతుంది. లేత ఆకులు సన్నగా, నిటారుగా పసుపు రంగుకు మారి పసుపు రంగు కోల్పోయి, తెలుపు రంగుకు మారతాయి. ముదురు ఆకులు ఎండి రాలిపోతాయి. ఇనుము లోపం వలన కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. పంట ఎదుగుదల ఆగిపోయి దిగుబడి 30–40 శాతం తగ్గుతుంది. వీని నివారణకు ఐదు గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ ఒక గ్రాము సిట్రిక్ ఆమ్లం కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ద్రావణాన్ని ఎప్పటికప్పుడు కలుపుకుంటూ పిచికారీ చేయాల్సి ఉంటుంది.

ఆకుపచ్చ తెగులు..

పంట వేసిన 30 రోజుల నుంచి ఈ తెగులు కనిపిస్తుంది. గుండ్రంగా ఉండి ఆకు పైభాగాన ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. తెగులు కన్పించిన వెంటనే ఎకరాకు 400 గ్రాముల మాంకోజెబ్ లేదా హెక్సాకొనాజోల్ 400 మిల్లీలీటర్లు లేదా కార్బన్‌డిజమ్ 200 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.